# బంధు ప్రేమ

కొడవటిగంటి

చెట్టుకింద కూర్చున్నాడు. శల్యావశిష్టంగా ఉన్నాడు.

"అంతా పోయింది. ఉద్యోగంలేదు. నాకెవరూ లేరు" అన్నాడు.

"ఎక్కడన్నా ఉద్యోగం సంపాదించుకో రాదా?"

"ఈవూళ్ళో ఉద్యోగాల్లేవు. చూస్తూ చూస్తూ బాగా బతికినచోట కూలిచేసుకోలేను...వూలూ కట్టెలూనా?"

"ఇంకోవూరు పోరాదూ?"

"బంధువుల్నందర్నీ విడిచా...అంతా ఇక్కడే ఉన్నారు."

"ఉంటే నీకెందుకు సహాయపడరు?"

"ఎట్లా సహాయపడతారు? వాళ్ళని పిలిచి గుప్పెడు మెతుకులు పెట్టలేను. వాళ్లు చెప్పినట్టు చేసినన్నాళ్ళూ, పాపం, నన్ను కనిపెట్టే ఉన్నారు."

"వాళ్ళేం చెప్పారు? నువ్వేంచేశావు?"

"వాళ్ళకి నాలో ఎంతో నమ్మకం. నన్ను పెద్ద చదువులకోసమని దూరదేశాలుపొమ్మన్నారు; నేను పోలేదు. ఇంటో ఏదన్నా అక్కరయితే డబ్బుకు వెనకాడకుండా అందర్నీ పిలిచి చక్కగా అక్కర జరుపుతానన్నారు; అట్లాగే చేస్తూవచ్చాను. ఎంత కురూపి అయినా సరే మేనరికమే చేసుకుంటాను గాని కట్నాల కాశపడి, అందమైన పిల్ల కావాలనీ చచ్చినా పైసంబంధం చేసుకోనన్నాను; మేనరికమే చేసుకున్నాను. పెళ్ళాంమెళ్ళో పుస్తె తాకట్టుపెట్టి అయినా సరే-ఐనవాళ్ళకి అడ్డుపడతాను కాని వాళ్ళిబ్బందిలో ఉంటే చూస్తూ మాత్రం ఊరుకోనన్నాను; పెళ్లాంమెళ్లో పుస్తె, తాకట్టుపెట్టటంకాదు, ఏకంగా అమ్మేసి అందరినీఆదుకున్నాను: ఆతరవాత నాకు రోజులు చాలిరాలేదు నేను అక్కరలుచెయ్యలేక పోయినాను.పోగొట్టుకున్నాననివాళ్ళందరికీకోపంవచ్చింది. పెళ్ళానికితిండి పెట్టలేక పోయినానని మామామ కోపంవచ్చింది. కూతుర్ని తీసుకుపోయి ఇంటో ఉంచుకున్నాడు. మరో కొడుకనుకుంటానన్నాడు...

మొహం చేతుల్లో పెట్టుకుని ఏడిచాడు.

"ఈ బంధువుల్ని మొదటినించీ దూరంగా ఉంచితే ఎంత సుఖపడి ఉండేవాడివి!" అన్నాను.

చప్పున తలఎత్తి నన్నోపామును చూసినట్టు భయంతోనూ అసహ్యంతోనూ చూసి, "నువ్వా అటువంటి వాడివేనా?" అన్నాడు.

"ఎటువంటివాణ్ణి?" అన్నాను.

"నన్నూ నాబంధువుల్నీ వేరుచెయ్యాలని చాలామంది ప్రయత్నించారు.

బోలెడంత కట్నం వస్తుంది పైపిల్లన్ని చేసుకోమన్నారు. అందంగాఉండే పిల్లల్ని నాకివ్వజూపారు కూడానూ. దుర్మార్గులు! ద్రోహులు! ఎక్కడికన్నా వెళ్ళితే పెద్ద ఉద్యోగాలు దొరుకుతాయని ఆశలు పెట్టారు."

"వాళ్ళమాటలు నీకెందుకు విషమయినై, వాళ్ళమాట వినక నువ్వు బాగుపడిందేమిటి?"

"ఇది కర్మ రాసిపెట్టిన రాత. అంతా పోతే పోయింది. నాబంధువులకి కొంతకాలమైనా ఉపయోగపడ్డవాణ్ణయినాను. నాకందుకు చింతలేదు."

"మరేమిటి నీచింత?"

"బంధువుల్ని దక్కించుకోలేక పోయినానే, వాళ్లకి సహాయపడలేక పోయినానే, వాళ్ళ గౌరవించినదల్లా దక్కించుకో లేకపోయినే అని!"

"ఇక అంతా అయిపోయింది గనక ఇప్పటికైనా ఎక్కడికన్నా వెళ్లి ఏదో ఉద్యోగంచేసి డబ్బు తెచ్చుకుని హాయిగా నీ భార్యతోపాటు జీవించుకోరాదూ?"

"మంచివాడివి! గొప్పసలహా చెప్పావు? తీరా ఎక్కడో కాని చోటచస్తే పరాయివాళ్లు మొయ్యటానికా? చాల్లే! జీవితానికేమిటి సత్యం? చావు! అయినవాళ్ళందరి మధ్య చావటం తప్ప నాకింకే కోరికాలేదు."

"నీకదీ దక్కదు. నువు చస్తే నీకోసం నీబంధువుల్లో ఒక్కరుకూడా ఏడవరు. నిన్ను చూట్టానికి ఒక్కరూరారు. ఎవరో పైవాళ్లు జాలిదలిచి నిన్ను అనాథ ప్రేతంకింద లాగి పారెయ్యాలిసిందే. ...ఇదంతా ఊహకాదు. నిజంగానే జరిగింది. నువు చావటం నేనెరుగుదును. నేను నీ మేనమామ కొడుకును...వస్తా."